VEGA
JEWELLERS
దివిలోనైనా... భువిలోనైనా.. వేగ తోడుంటే
వివాహం వైభోగం అవుతుంది.
ఆంధ్రప్రదేశ్ | తెలంగాణ | USA
follow us vegajewellers

# కలం కౌంటర్

KALAM COUNTER TELUGU DAILY

తెలుగు దినపత్రిక

సంపుటి : 9 సంచిక : 287

పేజీలు : 4 వెల రూ.4/-

Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor

బుధవారం 1 ఏప్రిల్ 2026




# కృతజ్ఞతలు










శ్రీ టి.జి వెంకటేష్ గారు
మాజీ మంత్రివర్యులు

శ్రీ ఇల్లూరి లక్ష్మయ్య గారు
అధ్యక్షులు : ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ

నా సేవల్ని గుర్తించి ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ
రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నూతన కార్యవర్గం లో అవకాశం కల్పించిన
మాజీ మంత్రివర్యులు శ్రీ టీజీ వెంకటేష్ గారికి,
జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీ శ్రీరాం తాతయ్య గారికి,
రాష్ట్ర మహాసభ అధ్యక్షులు శ్రీ ఇల్లూరి లక్ష్మయ్య గారికి,
మహాసభ రాష్ట్ర మాజీ అధ్యక్షులు శ్రీ చిన్ని రామ సత్యనారాయణ గారికి
ధన్యవాదాలు తెలియజేస్తున్నాను...



## బొగ్గవరపు వెంకట రాజారావు (రాజా)

ఉపాధ్యక్షులు : ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ
అధ్యక్షులు : NTR జిల్లా ఆర్యవైశ్య సంఘం
చైర్మన్ : పొట్టి శ్రీరాములు సేవా ట్రస్ట్
వత్సవాయి, ఎన్.టి.ఆర్ జిల్లా

# మేడ్ ఇన్ అమరావతి క్వాంటం హార్డ్ వేర్ లక్ష్యం

- క్వాంటం అప్లికేషన్లతో ఏపీకే తొలి ప్రయోజనాలు
- ఏప్రిల్ 14న దేశంలోనే తొలి ఓపెన్ క్వాంటం కంప్యూటర్ రాజధానిలో ప్రారంభం
- క్వాంటం హార్డ్ వేర్ మాన్యుఫాక్చరింగ్ ఎకో సిస్టం రౌండ్ టేబుల్ సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు






**అమరావతి,కలంకౌంటర్ :** రాజధాని అమరావతిలో ఏర్పాటు చేస్తున్న క్వాంటం కంప్యూటింగ్ వ్యాలీ దేశానికి ఓ నూతన దిశను అందిస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. జాతీయ క్వాంటం మిషన్ లక్ష్యాలను తొలిగా అందిపుచ్చుకుని ఏర్పాటు చేసిన అమరావతి క్వాంటం వ్యాలీ దేశానికి ప్రగతి ప్రేరకంగా మారుతుందని అన్నారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన అమరావతి క్వాంటం వ్యాలీ క్వాంటం హార్డ్ వేర్ మాన్యుఫాక్చరింగ్ ఎకోసిస్టమ్ పై జరిగిన రౌండ్ టేబుల్ సమావేశానికి ముఖ్యమంత్రి హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి నేషనల్ క్వాంటం మిషన్ డైరెక్టర్ జేబీవీ రెడ్డి, స్టేట్ క్వాంటం మిషన్ డైరెక్టర్ సీవీ శ్రీధర్, ఐబీఎం డైరెక్టర్ అమిత్ సింఘీ, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు సీడాక్, సీడాట్, డీఆర్ డీఓ, నేవల్ సైన్స్ టెక్నాలాజికల్ లేబొరేటరీ, బార్క్ సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. క్యూబిట్ ఫోర్స్, క్యూబీట్స్, క్వాంటం ఏఐ గ్లోబల్, క్యూపిఐ ఏఐ, ఆటోమియోనిక్స్ , తిరుపతి ఐఐటీ ప్రొఫెసర్ సత్యనారాయణ హాజరయ్యారు. మద్రాస్ ఐఐటీ ప్రొఫెసర్ కామకోటి వర్చువల్ గా ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి క్వాంటం కంప్యూటర్ పరికరాల తయారీ కంపెనీలు, క్రయోజనిక్స్, ఫోటోనిక్స్, పవర్ ఎలక్ట్రానిక్స్ కంపెనీల ప్రతినిధులు సైతం హాజరయ్యారు. వారిని ఉద్దేశించి సీఎం ప్రసంగిస్తూ.. రెండేళ్లలో దేశీయంగా క్వాంటం కంప్యూటింగ్ పరికరాల ఉత్పత్తి దిశగా కార్యాచరణ చేపట్టాలని సూచించారు. త్వరలో సిద్ధం కానున్న ఏక్యూవీ నుంచి క్వాంటం కంప్యూటింగ్ పరికరాలు, ఇతర హార్డ్ వేర్ ఉత్పత్తి, అల్గారిథమ్స్ రూపకల్పన వంటివి చేపట్టాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. 2030 నాటికి ప్రపంచ వ్యాప్తంగా 5 గ్లోబల్ క్వాంటం హబ్స్ లో ఒకటిగా ఏపీని తీర్చిదిద్దేలా కార్యాచరణ చేపట్టాలని రౌండ్ టేబుల్ సమావేశంలో అభిప్రాయం వ్యక్తం అయ్యింది. అమరావతి క్వాంటం వ్యాలీలో దీనికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనతో పాటు హార్డ్ వేర్, ఎకోసిస్టం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. బయోఫౌండ్రీ సహా వివిధ స్టార్టప్ ల సహకారంతో డిజైన్లు, ఆవిష్కరణలు, పరిశోధన చేపట్టాలని సమావేశంలో చర్చించారు. మేడ్ ఇన్ అమరావతి క్వాంటం కంప్యూటర్ పరికరాల ఉత్పత్తికి విస్తృత ప్రయత్నాలు చేయాలని సూచించారు. దేశంలో తొలి క్వాంటం కంప్యూటింగ్ పాలసీ కలిగిన రాష్ట్రంగా ఏపీ ఇప్పటికే క్వాంటం టెక్నాలజీ ప్రయాణాన్ని ప్రారంభించిందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. విజయవాడలోని మేధా టవర్స్ లో ఇప్పటికే తాత్కాలికంగా క్వాంటం కంప్యూటింగ్ మిషన్ కార్యాలయం కార్యకలాపాలు ప్రారంభం అయ్యాయని వివరించారు.

**ఏపీకే క్వాంటం తొలి ప్రయోజనాలు..** మూడు దశాబ్దాల క్రితం ఐటీని, ఇప్పుడు క్వాంటం కంప్యూటింగ్ టెక్నాలజీని ఫస్ట్ మూవర్ అడ్వాంటేజ్ గా అందిపుచ్చుకుంటున్నామని ముఖ్యమంత్రి వివరించారు. గతంలో ఐటీలో నిపుణుల్ని తయారుచేయడానికి ఇంజనీరింగ్ కాలేజీలు, ట్రిపుల్ ఐటీలను కూడా రాష్ట్రంలో ఏర్పాటు చేసుకున్నామని... ఇప్పుడు క్వాంటం టెక్నాలజీని అందిపుచ్చుకునేలా నిపుణులకు శిక్షణ ఇస్తున్నామని వివరించారు. వైసర్, ఐబీఎం లాంటి సంస్థల సహకారంతో యువతకు క్వాంటంలో నైపుణ్యాలు పెంచుతున్నామ న్నారు. అవేర్ ద్వారా రియల్ టైమ్ డేటా సేకరించటంతో పాటు రియల్ టైమ్ లో నిర్ణయాలు జరిగేలా చర్యలు చేపట్టామన్నారు. ఏఐ డాక్టర్, ఏఐ ట్యూటర్, ఏఐ అగ్రానమిస్ట్ లాంటి సేవలు పౌరులకు అందాల్సి ఉందన్నారు. ఆధునిక టెక్నాలజీలను తొలిగా అందిపుచ్చుకున్న వారికే ఎప్పుడూ ప్రయోజనాలు దక్కుతాయని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఐటీ ద్వారా హైదరాబాద్ నాలెడ్జి ఎకానమీగా మారిందని తద్వారా సేవల రంగం పెరిగి దేశానికి ప్రయోజనం కలుగుతోందన్నారు. భవిష్యత్తు అంతా ఇక క్వాంటం కంప్యూటింగ్‌దేనని జాతీయ క్వాంటం మిషన్ లక్ష్యానికి అనుగుణంగా ఏక్యూవీని ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ఐబీఎం, టీసీఎస్, ఎల్అండ్ టీ సహకారంతో దేశంలోనే తొలి క్వాంటం కంప్యూటర్ ఏపీలో ఏర్పాటు అవుతోందని సీఎం వివరించారు. రాజధాని అమరావతిలో క్వాంటం వ్యాలీలో నిర్మిస్తున్న 8 టవర్లలో క్వాంటం కంప్యూటింగ్ సెంటర్‌తో పాటు ఆవిష్కరణలు, పరిశోధనలతో పాటు స్టార్టప్‌లకు కూడా అవకాశం కల్పిస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. క్వాంటం హార్డ్ వేర్ దిగుమతి కాకుండా ఇక్కడే తయారు చేసుకోవాలన్న లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలియచేశారు. క్వాంటం పరికరాలు, టెక్నాలజీ, క్రయోజనిక్స్, అల్గారిథమ్స్ ఇలా మనమే తయారు చేసుకునేలా కార్యాచరణ చేపట్టాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. క్వాంటం కంప్యూటింగ్ వ్యాలీతో అమరావతి ఇక భవిష్యత్ నగరంగా అత్యుత్తమ లివబుల్ సిటీగా మారుతుందన్నారు. దీనికి అవసరమైన టెక్నాలజీని, భాగస్వామ్యాన్ని అందించాలని జాతీయ క్వాంటం మిషన్ ను ముఖ్యమంత్రి కోరారు.

**ఏప్రిల్ 14న అందుబాటులోకి తొలి ఓపెన్ క్వాంటం కంప్యూటర్..** దేశంలోనే తొలి ఓపెన్ క్వాంటం కంప్యూటర్ అమరావతిలో ఏప్రిల్ 14 తేదీ నుంచి అందరికీ అందుబాటులోకి తీసుకురానున్నట్టు క్యూబిట్ ఫోర్స్ సంస్థ డైరెక్టర్ వెంకట్ సుబ్రమణ్యన్, ఎస్ఆర్ఎం యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ సతీష్ కుమార్ ముఖ్యమంత్రికి వివరించారు. విద్యార్థులు, పరిశోధకులకు ఈ క్వాంటం కంప్యూటర్ టెస్టింగ్ కోసం సిద్ధంగా ఉంటుందని తెలిపారు. క్వాంటం ఎకోసిస్టమ్ కు అనువుగా టెస్ట్ బెడ్స్, సర్టిఫికేషన్ లాంటివి ఉండాలని కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ సీడాక్ ఈడీ సుదర్శన్ వివరించారు. క్వాంటం సిమ్యులేటర్స్ తో పాటు బయోసెన్సార్స్, మినరల్ సెన్సార్స్, లేజర్ అప్లికేషన్స్ అమరావతి క్వాంటం వ్యాలీలో అందించేందుకు సిద్ధమని వివిధ క్వాంటం కంప్యూటింగ్ సంస్థలు ముఖ్యమంత్రికి తెలియచేశాయి. జాతీయ క్వాంటం మిషన్ లక్ష్యాలను అందిపుచ్చుకోవటంలో ఏపీ అగ్రస్థానంలో ఉందని ఎన్ క్యూఎం మిషన్ డైరెక్టర్ జేబీవీ రెడ్డి ముఖ్యమంత్రికి తెలిపారు. మొత్తంగా 30కి పైగా క్వాంటం కంప్యూటింగ్ పరికరాల తయారీ కంపెనీలు ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరయ్యాయి. 15 కంపెనీలతో ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం అవగాహనా ఒప్పందాలను కుదుర్చుకుంది. విజయవాడలోని మేధా టవర్స్ లో 7 సంస్థలు ఇప్పటికే తమ కార్యకలాపాలను ప్రారంభించాయి.



జైనుల ఆధ్యాత్మిక గురువు మహావీర్ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు .
-అమరావతి,కలంకౌంటర్ :

# పరామర్శ..



**మంగళగిరి,కలంకౌంటర్ :** కృష్ణా జిల్లా చల్లపల్లి పోలీస్ స్టేషన్లో బాణాసంచా ప్రమాద బాధితులను పరామర్శించిన మంత్రి కొల్లు రవీంద్ర ఎస్సై, ఇద్దరు కానిస్టేబుళ్లకు గాయాల పట్ల మంత్రి విచారం మంగళగిరి ఎన్ఆర్ఐ ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు బాధితులకు అందుతున్న వైద్య సదుపాయాల గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు మెరుగైన వైద్య సదుపాయం కల్పించాలని డాక్టర్లకు సూచించారు ధైర్యంగా ఉండాలని ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ దీపావళి సమయంలో అక్రమ వ్యాపారం చేసిన వారివద్ద స్వాధీనం చేసుకున్న టపాసులు తరలిస్తున్న సమయంలో ప్రమాదం ముగ్గురు కూడా డాక్టర్ల పరిశీలనలో ఉన్నారు.. మెరుగైన వైద్యం అందుతోంది ప్రభుత్వం నుండి అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తున్నాం

## బంటుమిల్లి లో అంగన్వాడీల నిరసన



**బంటుమిల్లి,కలంకౌంటర్ :** అంగన్వాడి ల సమస్యలపై ప్రభుత్వం వహిస్తున్న నిర్లక్ష్య ధోరణిని నిరసిస్తూ సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మంగళవారం బంటిమిల్లి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆఫీసు ముందు ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీలు నిరసన వ్యక్తం చేశారు. అంగన్వాడీలకు వేతనాలు పెంచాలని తదితర సమస్యలపై నిరసన తెలియజేసారు. అనంతరం అంగన్వాడి టీచర్లు ఆయాలు సిడిపిఓ సముద్ర వేణి కి అర్జీ సమర్పించారు. ఈ కార్యక్రమంలో అంగనవాడి ప్రాజెక్ట్ అధ్యక్ష కార్యదర్శులు గోపి లక్ష్మి, కృష్ణవేణి, సెక్టార్ లీడర్లు,జోష్ మేరీ, అజయ్ కుమారి, రాణి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు పరుచూరి ధనశ్రీ మండల కన్వీనర్ మాజేటి శివ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## పదవి విరమణ చేసిన ప్రిన్సిపాల్ జగన్మోహన్రావుకి ఘనంగా వీడ్కోలు....

-కళాశాల అభివృద్ధిలో ప్రిన్సిపాల్ కృషి ఎనలేనిది ఎమ్మెల్యే కాగిత



**బంటుమిల్లి,కలంకౌంటర్ :** బంటుమిల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఐదు సంవత్సరాలుగా ప్రిన్సిపాల్ బాధ్యత నిర్వహిస్తూ మంగళవారం పదవీ విరమణ చేసిన ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ జగన్ మోహన్ రావు కు అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ వీడ్కోలు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు. పదవీ విరమణ చేసిన ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ జగన్మోహన్రావు దంపతులను ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది , విద్యార్థిని విద్యార్థులు ఘనంగా సన్మానించారు. సన్మాన సభలో ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా కళాశాల అభివృద్ధికి విద్యా బోధన అలాగే మంచి ఫలితాలు సాధించడంలో ప్రిన్సిపాల్ చేసిన కృషి ఎనలేనిది అన్నారు. అలాగే ప్రిన్సిపాల్ జగన్ మోహన్ రావు సారధ్యంలో కళాశాలలో జరిగిన అభివృద్ధి విద్యాబోధన తదితర కార్యక్రమాలపై అధ్యాపకులు విద్యార్థులు అలాగే రిటైర్డ్ ప్రిన్సిపల్ మట్ట రాధాకృష్ణమూర్తి తదితరులు తమదైన శైలిలో ప్రసంగించారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ జగన్ మోహన్ రావు మాట్లాడుతూ ఐదు సంవత్సరాలుగా అధ్యాపకులు అధ్యాపకేతుల సిబ్బంది విద్యార్థుల సహకారంతో నేను పని చేశానని తన పదవీకాలం తనకు ఎంతో సంతృప్తిని ఇచ్చిందన్నారు. అందరి సహకారంతో కళాశాల అభ్యున్నతికి ఎంతో కృషి చేశామన్నారు ఓ ఎన్ జి సి వారి నుండి అలాగే కేంద్ర ప్రభుత్వం నుండి దాదాపు 5 కోట్ల రూపాయలతో పాఠశాలను అభివృద్ధి చేశామన్నారు కాంపౌండ్ వాల్ నిర్మాణం బిల్డింగుల నిర్మాణం తదితర కన్స్ట్రక్షన్ సన్నీ పూర్తి చేసుకోగలుగుతున్నామన్నారు. తనకు జరిగిన సన్మానం అలాగే తనకు సహకరించిన అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థిని విద్యార్థులకు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ జగన్ మోహన్ రావు కృతజ్ఞతలు తెలిపారు.

## కృష్ణా జిల్లా చల్లపల్లి పోలీసు స్టేషన్ లో పేలుడు ఘటనపై స్పందించిన హోం మంత్రి అనిత

- కృష్ణా జిల్లా ఎస్పీతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్న మంత్రి.
- పోలీసులకు మెరుగైన వైద్యం అందించాలని మంత్రి ఆదేశం



**అమరావతి,కలంకౌంటర్ :** కృష్ణా జిల్లాలోని చల్లపల్లి పోలీస్ స్టేషన్‌లో జరిగిన బాణసంచా పేలుడు ఘటనపై రాష్ట్ర హోం మంత్రి అనిత తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటన దురదృష్టకరమని పేర్కొంటూ, వెంటనే స్పందించిన మంత్రి జిల్లా ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. ఈ ప్రమాదంలో గాయపడిన ఎస్ఐ దుర్గాంజనేయులు, కోర్టు కానిస్టేబుల్ అబ్దుల్లా సహా ఇతర సిబ్బందికి తక్షణం మెరుగైన వైద్య చికిత్స అందించాలని మంత్రి ఆదేశించారు. తీవ్రంగా గాయపడిన వారిని విజయవాడలోని ఆస్పత్రికి తరలించి ప్రత్యేక వైద్యం అందించాలని అధికారులను సూచించారు. బాధితులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని మంత్రి హామీ ఇచ్చారు. ఘటనకు సంబంధించి సమగ్ర నివేదికను సేకరించాలని, భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆమె ఆదేశాలు జారీ చేశారు.

## పవన్ కల్యాణ్ శాఖకు జాతీయ స్థాయిలో అవార్డుల పంట.. 24వ స్థానం నుంచి అగ్రస్థానానికి ఏపీ



**అమరావతి,కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ శాఖ జాతీయ స్థాయిలో సత్తా చాటింది. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నేతృత్వం వహిస్తున్న ఈ శాఖకు ఏకంగా ఐదు జాతీయ పురస్కారాలు లభించాయి. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, స్థానిక సంస్థల బలోపేతం, సేవల విస్తరణలో కనబరిచిన అత్యుత్తమ పనితీరుకు గానూ కేంద్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ ఈ అవార్డులను ప్రకటించింది. వివరాల్లోకి వెళితే... రాష్ట్రీయ గ్రామస్వరాజ్ అభియాన్, జల్ సంచయ్–జన్ భాగీదారి అనే రెండు కీలక విభాగాల్లో ఏపీ దేశంలోనే ప్రథమస్థానంలో నిలిచింది. మరో విభాగంలో ద్వితీయ స్థానం, ఇంకో రెండు విభాగాల్లో తృతీయ స్థానం దక్కించుకుని మొత్తం ఐదు అవార్డులను కైవసం చేసుకుంది. గ్రామ పంచాయతీలను స్వయం సమృద్ధిగా తీర్చిదిద్దడం, ప్రణాళికాబద్ధమైన అభివృద్ధిని ప్రోత్సహించే రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్‌లో ఏపీ పనితీరు విశేషంగా మెరుగుపడింది. గత ప్రభుత్వ హయాంలో ఇదే విభాగంలో 24వ స్థానంలో ఉన్న రాష్ట్రం, ఇప్పుడు దేశంలోనే మొదటి స్థానంలో నిలవడం గమనార్హం. అలాగే, తక్కువ ఖర్చుతో వర్షపు నీటిని నిల్వ చేసే పద్ధతులను ప్రోత్సహించే ‘జల్ సంచయ్ – జన్ భాగీదారీ’ కార్యక్రమంలోనూ ఏపీ అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. డిప్యూటీ సీఎంగా బాధ్యతలు స్వీకరించిన పవన్ కల్యాణ్ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, అటవీ, పర్యావరణం, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖలను పర్యవేక్షిస్తున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన, తాగునీటి సౌకర్యాలపై ఆయన ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగానే ‘పల్లెపండుగ 1.0’, ‘పల్లెపండుగ 2.0’ వంటి కార్యక్రమాలను ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా రికార్డు స్థాయిలో గ్రామసభలు నిర్వహించి, ప్రజల నుంచి నేరుగా వినతులు స్వీకరించారు. గ్రామసభలలో వచ్చిన విజ్ఞప్తుల ఆధారంగా ‘పల్లెవెలుగు’ కార్యక్రమాన్ని చేపట్టి గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలోనే శాఖ పనితీరు గణనీయంగా మెరుగుపడి, జాతీయ స్థాయిలో ఈ పురస్కారాలు దక్కడం విశేషం.

# మహాసభ మాజీ అధ్యక్షుడు జనసేనకి జై



**జంగారెడ్డిగూడెం,కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు చిన్ని రామ సత్యనారాయణ జనసేన లో చేరుతున్నారు. జంగారెడ్డిగూడెం లో జరిగే కార్యక్రమానికి వస్తున్న రాష్ట్ర నాయకులు సమక్షంలో జనసేన లో చేరుతారు.పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్నారు. ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్న సి హెచ్ ఆర్ చేరిక పార్టీకి మేలు జరిగే అవకాశం ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా ఆర్యవైశ్యుల్లో గుర్తింపు తెచ్చుకున్న సి హెచ్ ఆర్ కి జనసేన లో ప్రాధాన్యం ఇచ్చే అవకాశం ఉంది.

# రోడ్డు భద్రత కోసం ఆధునిక కంట్రోల్ రూమ్ ఏర్పాటు..

- డ్రైవర్లను ప్రత్యక్షంగా పర్యవేక్షించే వ్యవస్థ ప్రారంభనికి మంత్రి శ్రీకారం.
- రోడ్డు భద్రత కోసం మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక చొరవ.



**తాడేపల్లి,కలంకౌంటర్ :** రోడ్డు భద్రతను మరింత బలోపేతం చేయడానికి ఆధునిక సాంకేతికతను వినియోగిస్తున్నామని, ఈ నేపథ్యంలో కార్యాలయంలో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసి, బస్సు డ్రైవర్లను ప్రత్యక్షంగా పర్యవేక్షించే విధానాన్ని ప్రారంభించామని రాష్ట్ర రవాణా, యువజన ఉ క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి గారు తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుండి విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు. వాహనాల్లో ఏర్పాటు చేసిన డ్యాష్‌క్యామ్‌ల ద్వారా డ్రైవర్ ప్రవర్తన, వాహనం ముందు దృశ్యాలు నిరంతరం రికార్డ్ అవుతున్నాయని తెలిపారు. డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వినియోగం, ధూమపానం వంటి అనుచిత చర్యలు గుర్తించిన వెంటనే అలర్ట్‌లు వస్తాయని, వాటి ఆధారంగా కంట్రోల్ రూమ్ నుండి డ్రైవర్లను తక్షణమే హెచ్చరిస్తున్నామని చెప్పారు. అదేవిధంగా వాహనాల వేగాన్ని కూడా ఈ సిస్టమ్ ద్వారా పర్యవేక్షిస్తున్నామని పేర్కొన్నారు. ఈ డేటాను 8 రోజుల పాటు భద్రపరచడం జరుగుతుందని తెలిపారు. ఇటీవల బస్సు యజమానులతో నిర్వహించిన సమావేశంలో ఈ వ్యవస్థ అమలుకు వారు పూర్తి సహకారం అందించడానికి అంగీకరించారని చెప్పారు. ప్రస్తుతం IRA ట్రావెల్స్‌కు చెందిన 24 బస్సుల్లో ఈ సిస్టమ్ అమలులో ఉందని తెలిపారు. తదుపరి 15 నుంచి 30 రోజుల్లో అన్ని బస్సులకు ఈ వ్యవస్థను విస్తరించే లక్ష్యంతో పని చేస్తున్నామని, త్వరలోనే అధునాతన సదుపాయాలతో పెద్ద కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేయనున్నామని పేర్కొన్నారు. 1500 బస్సుల్లో ఈ వ్యవస్థ అమలు పూర్తైన తర్వాత అధికారిక ప్రారంభోత్సవం నిర్వహిస్తామని తెలిపారు. ఒక్కో బస్సుకు ఈ సిస్టమ్ అమలుకు సుమారు రూ.12,000 ఖర్చు అవుతుందని, నెలవారీ నిర్వహణ ఖర్చు రూ.750 వరకు ఉంటుందని తెలిపారు. ఈ మొత్తం వ్యయాన్ని బస్సు యజమానులే భరించడానికి ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణలో ఇది కీలకమైన అడుగుగా నిలుస్తుందని మంత్రి గారు పేర్కొన్నారు. డ్రైవర్ల భద్రతతో పాటు ప్రయాణికుల ప్రాణాలను కాపాడటంలో ఈ సాంకేతిక వ్యవస్థ ముఖ్య పాత్ర పోషిస్తుందని మంత్రి తెలిపారు.



జిల్లా పరిషత్ సి ఈ ఓ గా బాధ్యతలు స్వీకరించిన జె. అరుణ.
-మచిలీపట్నం,కలంకౌంటర్ :

# కృష్ణా విశ్వవిద్యాలయ మహిళల ఖో-ఖో జట్టు దక్షిణ మండల టోర్నమెంట్‌కు పయనం

## నున్నలోని వికాస్ ఫిజికల్ ఎడ్యకేషన్ కలాశాలలో శిక్షణా శిబిరం నిర్వహణ



**విజయవాడ రూరల్,కలంకౌంటర్ :** ఏప్రిల్ 1 నుండి 4 వరకు జరగనున్న దక్షిణ మండల అంతర్–విశ్వవిద్యాలయ మహిళల ఖో–ఖో టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు, కృష్ణా విశ్వవిద్యాలయ మహిళల ఖో–ఖో జట్టు మంగళవారం కర్ణాటకలోని దావణగెరె విశ్వవిద్యాలయానికి బయలుదేరింది. కఠోర శిక్షణ పొందిన అనంతరం, విజయవాడ నుండి ఈ జట్టు ఎంతో ఆశలతో తమ ప్రయాణాన్ని ప్రారంభించింది. అంతకుముందు, విజయవాడ గ్రామీణ మండలం, నున్నలోని వికాస్ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలలో కృష్ణా విశ్వవిద్యాలయ అంతర్–కళాశాల మహిళల ఖో–ఖో టోర్నమెంట్ నిర్వహించబడింది; ఇందులో క్రీడాకారిణుల ప్రదర్శన ఆధారంగా జట్టు ఎంపిక జరిగింది. తదనంతరం, ఎంపికైన జట్టు నైపుణ్యాలను మెరుగుపరుచుకునేందుకు, మార్చి 30 వరకు అదే ప్రాంగణంలో ఒక శిక్షణా శిబిరం నిర్వహించబడింది. జట్టు బయలుదేరే ముందు, వికాస్ ఇంజనీరింగ్ మరియు టెక్నాలజీ కళాశాల ఛైర్మన్ నరెడ్ల నర్సిరెడ్డి క్రీడాకారిణులకు ట్రాక్‌సూట్‌లను అందజేశారు. జట్టును ఉద్దేశించి మాట్లాడుతూ, వారు తమ పూర్తి సామర్థ్యంతో రాణించాలని, ఈ ప్రతిష్టాత్మక టోర్నమెంట్‌లో పతకాలు సాధించి కళాశాలకు కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని ఆయన ప్రోత్సహించారు. విద్యాబోధనతో పాటు క్రీడలకు కూడా తమ సంస్థ అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని ఆయన నొక్కి చెప్పారు. ఈ కార్యక్రమంలో వికాస్ బీపీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ దాసి సురేష్, జట్టు కోచ్ జి. రఘురామ్ తదితరులు పాల్గొన్నారు. కృష్ణా విశ్వవిద్యాలయ మహిళల ఖో–ఖో జట్టు సభ్యులు: ఫ్లి రమేజున్నిసా, గరికపాటి సారిక, నలబోలు పూజిత, శెట్టి సూర్య కళ (సిద్ధార్థ మహిళా కళాశాల, విజయవాడ); కొండుద్రు సుచిత్ర, మురుద్ది శృతి, మోసం రాణి, పథర్లపల్లి సాహిత్యం (ఎస్ ఆర్ ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, విజయవాడ); పటపంచల హారిక, గుత్తి సంధ్యారాణి (డాక్టర్ ఎల్‌హెచ్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మైలవరం); మెనిగ రాణి, పెమ్మని కావ్య (పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ మరియు సైన్స్ కళాశాల, విజయవాడ); తిరుమలశెట్టి నాగ చంద్రిక (ఎస్‌పీఎంహెచ్ కళాశాల, మచిలీపట్నం); గణెట్ల మన్మిత (వికాస్ శారీరక విద్యా కళాశాల, నున్న); మరియు సోయం నాగ దుర్గ (విజయా శారీరక విద్యా కళాశాల, నున్న).

# అధికారులంతా సమన్వయంతో పనిచేయాలి

## -జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి







**బాపట్ల,కలంకౌంటర్ :** మాదకద్రవ్యాల నియంత్రణ సమన్వయ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ మంగళవారం స్థానిక కలెక్టరేట్ లో నిర్వహించారు. "డ్రగ్స్ వద్దు, ఈగల్ క్లబ్స్ అంటూ అధికారులు రూపొందించిన ప్రత్యేక ప్రచార బోర్డులను జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ కలిసి విడుదల చేశారు. గంజాయి, మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల రహిత జిల్లాగా బాపట్లను చేయాలని కలెక్టర్ సూచించారు. రైల్వే స్టేషన్లు, బస్టాండ్లలో విస్తృతంగా తనిఖీలు చేయాలన్నారు. బాపట్ల జిల్లాలో మాదకద్రవ్యాల విక్రయాలు, వినియోగాలు ఎట్టి పరిస్థితిలో జరగడానికి వీలు లేదన్నారు. మత్తు పదార్థాలను సమూలంగా అరికట్టాలన్నారు. ఈగల్ క్లబ్స్ మాదిరిగా 100 మంది విద్యార్థులు ఉన్న ప్రతి పాఠశాలలో ప్రహరీ క్లబ్ లు ఏర్పాటు చేయాలన్నారు. ప్రత్యేకంగా వెబ్ సైట్ రూపొందించి వివరాలను నిక్షిప్తం చేయాలన్నారు. తద్వారా నిరంతర పర్యవేక్షణ ఉంటుందన్నారు. అవగాహన కార్యక్రమాలు, యువతను చైతన్య పరచడంతోనే మాదకద్రవ్యాలను నియంత్రించగలమన్నారు. మంచి సమాజ నిర్మాణం కొరకు అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. బాపట్ల రైల్వే స్టేషన్ మీదుగా 120 రైళ్లు ప్రతిరోజు రాకపోకలు సాగిస్తుంటాయన్నారు. ప్రతిరోజు రైల్వే, బస్సు స్టేషన్లలో నిఘా ఉండాలన్నారు. మాదకద్రవ్యాల వినియోగానికి బ్లాక్ స్పాట్ లుగా గుర్తించిన ప్రాంతాలలో విద్యుత్ దీపాలు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. మాదకద్రవ్యాలకు విద్యార్థులు, యువత ప్రభావితం గాకుండా చూడాల్సిన బాధ్యత యంత్రాంగంపై ఉందన్నారు. నషా ముక్త్ భారత్ లక్ష్యంతో పోలీసు అధికారులు సమర్థంగా పనిచేయాలని జిల్లా ఎస్పీ గారు తెలిపారు. డ్రగ్స్ రహిత సమాజం కొరకు అధికారులు నిరంతరం కృషి చేయాలన్నారు. శక్తి బృందాలు, ఈగల్ బృందాలు మరింత చురుకుగా వ్యవహరించాలన్నారు. మొదటి విడతలో చేపట్టిన అవగాహన ప్రచార కార్యక్రమాలు సత్ఫలితాలను ఇచ్చాయన్నారు. ఇదే మాదిరిగా రెండో విడతలోను జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా అవగాహన ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఇందు కొరకు సమగ్ర ప్రణాళిక రూపొందించామన్నారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగం పూర్తిగా అరికట్టడానికి విద్యా, వైద్య ఆరోగ్యశాఖలతోపాటు ఆర్ పి ఎఫ్, రవాణా శాఖ వంటి అనుబంధ శాఖల అధికారులు తమ సహకారం అందించాలన్నారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ సమయంలో సచివాలయాల స్థాయి వెల్ఫేర్ సెక్రెటరీ, మహిళా పోలీసులు గ్రామాలలో విస్తృత ప్రచారం చేయాలన్నారు. అవగాహన కార్యక్రమాలతోనే గంజాయి, మాదకద్రవ్యాల భారిన పడకుండా ప్రజలను కాపాడవచ్చన్నారు. గంజాయి ప్రభావానికి యువత గురికాకుండా కళాశాలలో అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతం గుర్తించిన 74 హాట్ స్పాట్ లలో పోలీసుల నిఘా ఉంచామన్నారు. మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణాపై ఏదైనా అనుమానిత ప్రాంతాలు, వ్యక్తులు ఉన్నట్లు అధికారులు గుర్తిస్తే తక్షణమే సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో బాపట్ల, చీరాల డీఎస్పీలు పి.జగదీష్ నాయక్, ఎండి.మోయిన్, చీరాల ఆర్డీవో టి చంద్రశేఖర్, ఈగల్ సెల్ సిబ్బంది, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రగతి పథంలో తుడా!!

## డాలర్స్ దివాకర్ రెడ్డి మార్క్ అభివృద్ధి!!



**తిరుపతి,కలంకౌంటర్ :** ఆధ్యాత్మిక నగరి తిరుపతి ముఖచిత్రాన్ని మార్చడంలో తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి తనదైన ముద్ర వేస్తున్నారు. సుమారు మూడు దశాబ్దాలుగా పరిష్కారం కాని శెట్టిపల్లి భూ సమస్యను అత్యంత చాకచక్యంగా పరిష్కరించి, రైతు కుటుంబాల కళ్లలో ఆనందాన్ని నింపారు. చట్టపరమైన చిక్కులను తొలగించి, రైతులకు తమ భూములపై పూర్తి హక్కులు కల్పించడంలో ఆయన చూపిన చొరవ, ఒక నాయకుడికి ఉండాల్సిన చిత్తశుద్ధికి నిదర్శనంగా నిలుస్తోంది. ఇది కేవలం ఒక సమస్య పరిష్కారం కాదు, దశాబ్దాల తరబడి నలుగుతున్న ఒక సామాజిక చిక్కుముడిని విప్పిన సాహసోపేత నిర్ణయం.

**పర్యావరణ హితం.. అవిలాల చెరువు పునరుజ్జీవం...** నగర విస్తరణతో పాటు పర్యావరణ పరిరక్షణకు దివాకర్ రెడ్డి పెద్దపీట వేస్తున్నారు. ఒకప్పుడు నిర్లక్ష్యానికి గురైన అవిలాల చెరువును అద్భుతమైన ఎకో–టూరిజం హబ్‌గా తీర్చిదిద్దేందుకు ఆయన శ్రీకారం చుట్టారు. కేవలం పూడికతీత పనులకే పరిమితం కాకుండా, ఆధునిక వాకింగ్ ట్రాక్స్, సుందరమైన పార్కులు, పర్యాటకులను ఆకర్షించేలా మౌలిక వసతులను కల్పిస్తున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా అటు భూగర్భ జల మట్టం పెరగడమే కాకుండా, తిరుపతి ప్రజలకు ఒక అద్భుతమైన "గ్రీన్ లంగ్ స్పేస్" అందుబాటులోకి రానుంది.

**మౌలిక సదుపాయాల విప్లవంబిమాస్టర్ ప్లాన్ రోడ్లు..** నగర ట్రాఫిక్ కష్టాలను తీర్చేందుకు మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణాన్ని యుద్ధ ప్రాతిపదికన చేపట్టారు. +.ా.=ు.చీశీ. 145, 168 ద్వారా నిధుల సమీకరణ చేస్తూ, రికార్డు స్థాయిలో 80 అడుగుల వెడల్పుతో ప్రధాన రహదారులను పూర్తి చేస్తున్నారు. గతంలో పెండింగ్‌లో ఉన్న మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను G.O.MS.No. 210 ప్రకారం నిధులు విడుదల చేయించి, స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ పనుల్లో నాణ్యతను పెంచుతున్నారు. దీనివల్ల తిరుపతి నగరం ఒక క్రమబద్ధమైన రీతిలో విస్తరిస్తూ విశ్వనగరంగా ఎదుగుతోంది.

**విలీన గ్రామాల అభివృద్ధి రూ.150 కోట్ల సంక్షేమం..** అభివృద్ధిని కేవలం నగరానికే పరిమితం చేయకుండా, తుడా పరిధిలోని విలీన గ్రామాలకు సైతం విస్తరింపజేశారు. ప్రభుత్వ ఉత్తర్వు G.O. 42 ప్రకారం సుమారు రూ.150 కోట్లతో పల్లెల్లో డ్రైనేజీ, తాగునీరు, కనీస మౌలిక వసతుల ప్రాజెక్టులను చేపట్టారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు సైతం పట్టణ స్థాయి సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా ఆయన పాలన సాగుతోంది. సామాన్యుడి అవసరాలను గుర్తించి, వాటిని జీవోలుగా మలిచి, అమలు చేయడంలో దివాకర్ రెడ్డి తనదైన వేగాన్ని ప్రదర్శిస్తున్నారు.

**పారదర్శక పాలన - సామాన్యుడికి సొంతింటి కల..** రియల్ ఎస్టేట్ రంగంలో పారదర్శకతను పెంచుతూ అక్రమ లేఅవుట్లకు అడ్డుకట్ట వేశారు. G.O.MS.No. 116 నిబంధనలను కచ్చితంగా అమలు చేస్తూ, మధ్యతరగతి ప్రజలకు తక్కువ ధరకే ప్లాట్లు అందేలా చర్యలు తీసుకుంటున్నారు. గడిచిన ఏడాది కాలంలోనే రూ.500 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు జీవోల సాక్షిగా ఆమోదం ముద్ర వేయించి, ప్రతి రూపాయికి జవాబుదారీతనంగా నిలిచారు. G.O.RT.No. 88 ద్వారా పార్కుల సుందరీకరణ చేపడుతూ తిరుపతిని ఒక స్వచ్ఛమైన గ్రీన్ సిటీగా మార్చడంలో దివాకర్ రెడ్డి చూపుతున్న విజన్ భవిష్యత్తు తరాలకు బలమైన పునాది కానుంది.

# క్రికెట్ బెట్టింగు నిర్వహించినా , పాల్గొన్నా కఠినంగా వ్యవహరిస్తాం-జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్



**విజయనగరం,కలంకౌంటర్ :** క్రికెట్ బెట్టింగులకు పాల్పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని యువతకు జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ పిలుపునిచ్చారు. ప్రస్తుతం ఐపిఎల్ క్రికెట్ మ్యాచ్ లు జరుగుతున్న నేపథ్యంలో ఆన్–లైన్, ఆఫ్–లైన్ క్రికెట్ బెట్టింగులకు పాల్పడేవారు, ముఖ్యంగా యువత అప్రమత్తంగా ఉండాలని, ఆర్థికంగా జీవితాలను నాశనం చేసే బెట్టింగుల జోలికి పోవద్దని ప్రజలు, యువతను జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ హెచ్చరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ మాట్లాడుతూ – బెట్టింగులకు పాల్పడడం వలన ఆర్థికంగా ఎక్కువగా నష్టం కలిగిస్తాయని, సాఫీగా సాగిపోతున్న జీవితాలను నాశనం చేస్తాయన్నారు. క్రికెట్ బెట్టింగ్ చట్టవిరుద్ధమైన చర్య అని, ఇందులో పాల్గొనే వారు, నిర్వహించే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటికే ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, బుకీలపై అనుమానాస్పద ప్రాంతాల్లో దాడులు నిర్వహిస్తూ నిరంతరం నిఘా పెట్టామన్నారు. క్రికెట్ ను ఆస్వాదించాలి తప్ప ఇటువంటి చట్ట వ్యతిరేక బెట్టింగులకు పాల్పడకూడదని జిల్లా ఎస్పీ తెలిపారు. తల్లితండ్రులు కూడా తమ పిల్లల ప్రవర్తనను నిత్యం గమనిస్తూ ఉండాలన్నారు. ఒకసారి బెట్టింగులకు అలవాటు పడిన వ్యక్తులు ఆ వ్యసనం నుండి బయటకు రాలేరని, ఆలోచనలన్నీ బెట్టింగు మీదనే పెట్టి, ఆర్థిక నష్టాలకు గురై వారి జీవితాలను నాశనం చేసుకుంటారని జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ తరహా బెట్టింగులకు పాల్పడడం చట్ట విరుద్ధమని, ఎవరైనా బెట్టింగులకు పాల్పడి పట్టుబడితే చట్టపరమైన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ హెచ్చరించారు. ఈ తరహా కేసుల్లో నిందితులకు జైలు శిక్షలు, పెద్ద మొత్తంలో జరిమానాలు తప్పవన్నారు. , ప్రజలు, ముఖ్యంగా యువత తమ జీవితాలను నాశనం చేసే బెట్టింగు జోలికి పోవద్దన్నారు. బెట్టింగులతో డబ్బులు సంపాదించవచ్చు అనే అత్యాశతో బెట్టింగులకు పాల్పడే కంటే ఆర్థిక భద్రత కోసం కష్టపడి పని చేయడం, న్యాయబద్ధంగా సంపాదించిన నగదును సద్వినియోగం చేసుకోవడం ఉత్తమమైన మార్గమని ప్రజలకు జిల్లా ఎస్పీ సూచించారు. ఆన్–లైన్ లేదా ఆఫ్–లైన్ బెట్టింగులకు పాల్పడేవారి సమాచారాన్ని డయల్ 112/100 లేదా స్థానిక పోలీస్ స్టేషనుకు సమాచారం అందించాలని, వారి వివరాలను గోప్యంగా ఉంచబడతాయని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ కోరారు.

# బ్రహ్మోత్సవాలు సందర్భంగా భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ







**మార్కాపురం,కలంకౌంటర్ :** మార్కాపురం జిల్లా రాచర్ల పోలీస్ స్టేషన్ పరిధిలో శ్రీ నెమలిగుండ్ల రంగనాయక స్వామి వారి దేవాలయాన్ని మంగళవారం జిల్లా ఎస్పీ తో పాటు గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి సందర్శించారు. ఏప్రిల్ 2 నుండి 5 వరకు ఈ బ్రహ్మోత్సవాలు పూజా కార్యక్రమాలు, కళ్యాణం, తెప్పోత్సవం, రథోత్సవం, సందర్భంగా చేపట్టిన భద్రతా ఏర్పాట్లను జిల్లా ఎస్పీ పరిశీలించారు. ఈ సందర్భంగా దేవాలయ పరిసరాలు, ప్రవేశ మార్గాలు, రథం వద్ద ఏర్పాటు చేసిన భద్రతా చర్యలు, బందోబస్తు మరియు ట్రాఫిక్ నియంత్రణ ఏర్పాట్లను సమీక్షించారు. పోలీస్ అధికారులతో పాటు ఆలయ కమిటీ సభ్యులకు పలు సూచనలు చేశారు. దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా బందోబస్తు ఏర్పాట్లు చేయాలని, వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా ప్రణాళికాబద్ధంగా ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం డీఎస్పీ నాగరాజు, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు, డిసిఆర్బిసిఐ దేవ ప్రభాకర్, గిద్దలూరు రామకోటయ్య, కంభం సీఐ మల్లికార్జున, రాచర్ల ఎస్సై పి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# కే బి జి రూముల్లో అపరిశుభ్రం - ఆగ్రహం వ్యక్తం చేసిన ఎమ్మెల్యేఇంటూరి





**కందుకూరు, కలంకౌంటర్ :** వలేటివారిపాలెంలోని కస్తూరిబాగాంధీ విద్యాలయాన్ని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మంగళవారం మధ్యాహ్నం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులు, హాస్టల్ రూములు, బాత్రూములు, వంటగది, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థినులను అడిగి హాస్టల్ లో వసతులు గురించి మాట్లాడారు. ఈ సందర్భంగా బాత్రూములలో నీళ్లు నిలిచి ఉండడాన్ని ఎమ్మెల్యే చూశారు. అక్కడి నుంచి వచ్చే మురుగునీరు క్లాస్ రూముల పక్కన నిల్వ ఉండడాన్ని గమనించారు. ఇలాంటి అపరిశుభ్ర వాతావం–ణంలో పిల్లలకు అసౌకర్యంగా ఉంటుందని, ఎందుకు పట్టించుకోవడంలేదని ప్రిన్సిపల్ పై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే బాగు చేయించాలని ఆదేశించారు. అలాగే హాస్టల్ రూమ్స్ లో పేరుకుపోయిన చెత్తను చూసిన ఎమ్మెల్యే మరోసారి ఇలా కనిపిస్తే చర్యలు తీసుకుంటానని గట్టిగా మందలించారు. మధ్యాహ్న భోజనాన్ని కూడా ఆయన పరిశీలించి, మెనూ తప్పక పాటించాలని సూచించారు. విద్యార్థినిలు ఇబ్బంది పడకుండా వరండాలో ఫ్లోరింగ్ ఎత్తు పెంచాలన్నారు. ఎమ్మెల్యే వెంట మండల టిడిపి అధ్యక్షులు మాదాల లక్ష్మీనరసింహ తదితరులు ఉన్నారు.

# కొత్తూరి సుధాకర్ ను పరామర్శించిన ఎమ్మెల్యే ఇంటూరి



**కందుకూరు, కలంకౌంటర్ :** కందుకూరు పట్టణానికి చెందిన ఆర్యవైశ్య నేత, తెలుగుదేశం పార్టీ నాయకుడు కొత్తూరి వెంకట సుధాకర్ అనారోగ్యంతో ఒంగోలులోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు మంగళవారం హాస్పిటల్ కు వెళ్లి సుధాకర్ ను పరామర్శించారు. డాక్టర్లతో మాట్లాడి ట్రీట్మెంట్ వివరాలు తెలుసుకున్నారు. ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోవాలని సుధాకర్ కు సూచిస్తూ.... త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే వెంట కందుకూరు పట్టణ టిడిపి అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, ఆర్యవైశ్య నాయకుడు మురారిశెట్టి సుధీర్ ఉన్నారు.

# ఏపీ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత... రేపే లోక్‌సభలో కీలక బిల్లు

**అమరావతి, కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించే దిశగా కీలక పరిణామం చోటుచేసుకోనుంది. 'ఆంధ్రప్రదేశ్ పునర్విభజన (సవరణ) బిల్లు 2026'ను రేపు (ఏప్రిల్ 1) బుధవారం లోక్‌సభలో ప్రవేశపెట్టనున్నారు. ఈ బిల్లు ద్వారా 2014 నాటి ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టానికి సవరణ చేసి, రాష్ట్ర నూతన రాజధానిగా 'అమరావతి' పేరును అధికారికంగా చేర్చనున్నారు. ఈ బిల్లు ద్వారా పునర్విభజన చట్టంలోని సెక్షన్ 5, సబ్–సెక్షన్ (2)కు సవరణ చేయనున్నారు. ప్రస్తుతం ఈ సెక్షన్‌లో ఉన్న... 'రాష్ట్రానికి ఒక కొత్త రాజధాని ఉంటుంది' (and there shall be a new capital) అనే వాక్యం స్థానంలో 'అమరావతి కొత్త రాజధానిగా ఉంటుంది' (and Amaravati shall be the new capital)... అని చేర్చనున్నారు. అంతేకాకుండా, 'అమరావతి' అనే పదంలో ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఙూాజ=ణూా) చట్టం, 2014 ప్రకారం నోటిఫై చేసిన రాజధాని నగర ప్రాంతాలు కూడా కలిసి ఉంటాయని ఈ సవరణలో స్పష్టంగా వివరించనున్నారు. ఈ సవరణ జూన్ 2, 2024 నుంచే అమల్లోకి వచ్చినట్లుగా పరిగణించనున్నట్లు బిల్లులో పేర్కొనడం గమనార్హం. రాష్ట్రంలో టీడీపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమరావతిని ఏకైక రాజధానిగా నిలబెట్టేందుకు కృషి చేస్తోంది.

ఇందులో భాగంగా, మార్చి 28న ఆంధ్రప్రదేశ్ శాసనసభ ప్రత్యేక సమావేశంలో ఒక తీర్మానాన్ని ఆమోదించింది. పునర్విభజన చట్టంలోని సెక్షన్ 5ను సవరించి 'అమరావతి' పేరును అధికారికంగా చేర్చాలని ఆ తీర్మానంలో కేంద్రాన్ని కోరింది. 2022 మార్చి 3న హైకోర్టు ఇచ్చిన ఆదేశాల్లోని సలహా మేరకే ఈ మార్పులు చేస్తున్నట్లు అసెంబ్లీ తీర్మానంలో పేర్కొన్నారు.

# మర్యాద పూర్వక కలయిక



**మంగళగిరి,కలంకౌంటర్ :** రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ను మర్యాద పూర్వకంగా కలిసిన కలం కౌంటర్ దినపత్రిక అధినేత రవికుమార్.

# రాష్ట్ర మంత్రి లోకేష్ కు కృతజ్ఞతాభినందనలు



**మంగళగిరి,కలంకౌంటర్ :** ఆర్యవైశ్యులు కుల దైవం అమ్మ వారి క్షేత్రం అయిన పెనుగొండ ను వాసవి పెనుగొండ గా మార్చి అమరావతిలో అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహావిష్కరణ కార్యక్రమం దిగ్విజయంగా పూర్తి చేసినందుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి సహాయ సహకారాలు అందించిన టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ ను మంగళగిరి టిడిపి ప్రధాన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి ఆంధ్రప్రదేశ్ ఆర్య వైశ్య జర్నలిస్టుల సంక్షేమ సంఘం తరపున ప్రత్యేక కృతజ్ఞతాభినందనలు తెలియ చేసిన ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య జర్నలిస్టుల సంక్షేమ సంఘుశీ నాయకులు.సంఘం ఆవిర్భావం గురించి వారికీ తెలియపరచగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సహాయ సహకారాలు అందజేస్తామని హామీ ఇచ్చారు.వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపిన ఆర్యవైశ్య జర్నలిస్టు సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ రవికుమార్, ప్రధాన కార్యదర్శి చలపాటి రవికుమార్, రాష్ట్ర సహాయ కార్యదర్శి. చెక్క కేశవరావు, పల్నాడు జిల్లా కోఆర్డినేటర్ కె ఆదిత్య ప్రసాద్.

# గ్యాస్ పుష్కలంగా ఉంది

● గ్యాస్ నిల్వలపై పుకార్లను నమ్మొద్దు ● సగం ధరలకు ఇండక్షన్ గ్యాస్ స్టవ్ ల పంపిణీ - మంత్రి సవిత







**పెనుకొండ/శ్రీసత్యసాయి,కలంకౌంటర్ :** : గ్యాస్ నిల్వలు పుష్కలంగా ఉన్నాయని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత భరోసా ఇచ్చారు. ఎప్పటిలాగే ఇండెంట్ పెట్టిన వారందరికీ సకాలంలో గ్యాస్ సిలిండర్లు సరఫరా చేస్తారన్నారు. యుద్ధం నేపథ్యంలో భవిష్యత్తులో కూడా ఇబ్బందులు రాకూడదనే ప్రత్యామ్నాయ మార్గాలు కూడా అన్వేషిస్తున్నామన్నారు. పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యంతో పాటు అభివృద్ధి సాధ్యమవుతుందని మంత్రి సవిత స్పష్టంచేశారు. పట్టణంలోని స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఇండక్షన్ స్టవ్ మేళా కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మధ్యప్రాచ్యం యుద్ధం నేపథ్యంలో గ్యాస్, పెట్రోల్, డీజిల్ నిల్వలు తగ్గిపోయాయంటూ వస్తున్న అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మొద్దని, అవన్నీ ఒట్టి పుకార్లననని కొట్టిపారేశారు. దేశంలో, రాష్ట్రంలో అవసరమైనన్ని గ్యాస్, పెట్రోల్, డీజిల్ నిల్వలు పుష్కలంగా ఉన్నాయన్నారు. ముఖ్యంగా గ్యాస్ సిలిండర్లకు ఎప్పటిలాగే ఇండెంట్ పెట్టుకోవాలని, సకాలంలోనే ఏజెన్సీలు గ్యాస్ సరఫరా చేస్తాయని వెల్లడించారు. యుద్ధం నేపథ్యంలో భవిష్యత్తులో కూడా ఇబ్బందులు రాకూడదనే ప్రత్యామ్నాయ మార్గాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్వేషిస్తున్నాయన్నారు. దాంట్లో భాగంగా విద్యుత్ పనిచేసే ఇండక్షన్ స్టవ్ లను సగం ధరకే ప్రజలకు అందిస్తున్నామన్నారు. మార్కెట్ లో ఇండక్షన్ స్టవ్ ధర రూ.4,700లుంటే దానిని రూ.2,400లకే అందజేస్తున్నామన్నారు. జిల్లాకు 15 వేల ఇండక్షన్ స్టవ్ లను కేటాయించగా, పెనుకొండ నియోజక వర్గానికి రెండు వేల వరకూ వచ్చాయన్నారు. ఎన్ని ఇండక్షన్ స్టవ్ లు కావాలనుకుంటే, అన్నింటిని సరఫరా చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి సవిత స్పష్టంచేశారు.

**చెత్త ఇచ్చి నిత్యావసర సరుకులు తీసుకోండి...** కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అన్ని గ్రామాల్లోనూ పరిశుభ్రతకు పెద్దపీట వేస్తోందని మంత్రి సవిత తెలిపారు. గ్రామీణ స్థాయి నుంచే పారిశుద్యానికి పెద్దపీట వేయాలని నిర్ణయించి, స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమానికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. చెత్తతో సంపద సృష్టించేలా మండలానికో స్వచ్ఛ రథాన్ని రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిందన్నారు. ఊళ్లలోకి స్వచ్ఛ రథం వచ్చినప్పుడు ఇంట్లో ఉన్న పనికిరాని ప్లాస్టిక్ బాటిళ్లు, కవర్లు, గాజు సీసాలు, పేపర్లు, పాత పుస్తకాలు, ఎలక్ట్రానిక్ వ్యర్థాలు, ఇనుము, స్టీల్, అల్యూమినియం వస్తువులను ఈ రథానికి ఇచ్చి, వాటికి బదులుగా నిత్యావసర సరుకులను ప్రజలు పొందవచ్చునన్నారు. ఈ కార్యక్రమం పర్యావరణ పరిరక్షణతో పాటు, వ్యర్థాల నిర్వహణకు మరియు గ్రామీణ ప్రాంతాల పరిశుభ్రతకు దోహదపడుతుందన్నారు. ఇళ్ల వద్దకు వచ్చే పారిశుధ్య సిబ్బందికి ప్రజలు తడి చెత్త, పొడి చెత్త వేర్వేరుగా ఇవ్వాలని సూచించారు.

**చెత్తపై పన్నువేసిన చరిత్ర జగన్ ది...** అనంతరం తనను కలిసిన విలేకరులతో మంత్రి సవిత మాట్లాడుతూ, చెత్త నుంచి కూటమి ప్రభుత్వం సంపద సృష్టిస్తుంటే, గత ప్రభుత్వంలో అదే చెత్తపై పనులు వేసి ప్రజలపై భారం మోపారని మండిపడ్డారు. అన్నింటా జె ట్యాక్స్ చేయడం వసూలు చేయడానికి అలవాటు పడిన జగన్, చెత్తపై కూడా పన్ను వేసి ప్రజలను దోచుకున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజాహితం కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. ఎన్నికల హామీలు అమలు చేయడంతో పాటు సూపర్ సిక్స్ పథకాలను విజయవంతం చేసిందని మంత్రి సవిత తెలిపారు. అంతకుముందు ఇండక్షన్ స్టవ్ మేళా సందర్భంగా కొందరు లబిధదారులకు ఇండక్షన్ స్టవ్ లను పంపిణీ చేశారు. అనంతరం మూడు స్వచ్ఛ రథాలను మంత్రి సవిత జెండా ఊపి ప్రారంభించారు. చెత్త తోపుడు బండ్లను పారిశుధ్య సిబ్బందికి మంత్రి అందజేశారు.


# ప్రజల కు సంతృప్తి నివ్వడమే అంతిమ లక్ష్యం: ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్





**బంటుమిల్లి,కలంకౌంటర్ :** ప్రజా సమస్యలు పరిష్కరిస్తూ ప్రజలకు సంతృప్తినివ్వడమే మన అంతిమ లక్ష్యం అని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ అధికారులకు సూచించారు. మంగళవారం బంటుమిల్లి మండలం నాగేశ్వరావు పేట క్యాంప్ కార్యాలయంలో పీజీఆర్ఎస్ (PGRS) ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ పనితీరుపై అధికారులతో శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖల వారీగా వచ్చిన అర్జీలు, ఫిర్యాదుల పరిష్కార దశలు మరియు పెండింగ్ లో ఉన్న సమస్యలను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సమావేశంలో అధికారులకు మరియు సిబ్బందికి ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ పలు కీలక సూచనలు, కఠినమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రతి ఒక్క ఉద్యోగి పనితీరును నిశితంగా గమనిస్తున్నామని, విధి నిర్వహణలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా ఉపేక్షించేది లేదని అధికారులకు స్పష్టం చేశారు. బాధ్యతాయుతంగా పనిచేసి సత్వరమే సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజల సంతృప్తియే మన అంతిమ లక్ష్యం అని అధికారులకు దిశానిర్దేశం చేశారు. పీజీఆర్ఎస్ ద్వారా వచ్చే ప్రతి ఫిర్యాదుకు శాశ్వత పరిష్కారం చూపినప్పుడే ప్రజలకు ప్రభుత్వ వ్యవస్థల పట్ల నమ్మకం పెరుగుతుందనీ ఎమ్మెల్యే కాగిత గుర్తు చేశారు. తమ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాలకు వచ్చే పౌరులతో ప్రతి అధికారి, ఉద్యోగి అత్యంత మర్యాదగా మరియు సున్నితంగా మాట్లాడాలని సూచించారు. ప్రజల సమస్యలను ఓపికగా విని, వారికి భరోసా కల్పించే విధంగా మన వ్యవహారశైలి ఉండాలని స్పష్టం చేశారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, పారదర్శకంగా, జవాబుదారీతనంతో సేవలు అందించాలని అధికారులను ఎమ్మెల్యే కాగిత కోరారు. ఈ సమీక్షా సమావేశంలో వివిధ శాఖల ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పంచాయతీరాజ్ శాఖకు అవార్డులపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభినందనలు



**అమరావతి,కలంకౌంటర్ :** జాతీయస్థాయి అవార్డులు సాధించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుభాకాంక్షలు తెలిపారు. గ్రామాభివృద్ధే రాష్ట్రాభివృద్ధి అని బలంగా విశ్వసించే ప్రభుత్వంగా పల్లెల్లో వెలుగులు నింపుతున్నామని ముఖ్యమంత్రి అన్నారు. సుపరిపాలన, పేదరిక నిర్మూలన - జీవనోపాధి, మౌలిక సదుపాయాలు, ఉత్తమ మండలం, మహిళా స్నేహపూర్వక పంచాయతీ వంటి ఐదు అంశాల్లో వచ్చిన అవార్డులు 21 నెలల సుపరిపాలనకు అద్దం పడుతున్నాయని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. అత్యుత్తమ విధానాలు, సంస్కరణలతో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖను ముందుకు నడిపిస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గారికి, ఆ శాఖ అధికారులకు, ఉద్యోగులకు సీఎం అభినందనలు తెలిపారు. గ్రామ స్వరాజ్య స్థాపనలో మరెన్నో విజయాలు అందుకోవాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

# ఇది లక్షద్వీప్ కాదు... వైజాగ్!: ఆసక్తికర వీడియో పంచుకున్న మంత్రి నారా లోకేశ



**అమరావతి, కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగ అభివృద్ధిపై రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ ప్రత్యేకంగా దృష్టి సారించారు. రాష్ట్రంలోని పర్యాటక ప్రదేశాల గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిచెప్పేలా సోషల్ మీడియా వేదికగా ఒక ఆసక్తికరమైన ప్రచార వీడియోను ఆయన పంచుకున్నారు. రాష్ట్ర పర్యాటక రంగానికి కొత్త ఊపు తెచ్చే ఈ వీడియో ఇప్పుడు నెటిజన్లను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ ప్రచార వీడియోలో ఏపీలోని పలు సుందర ప్రదేశాలను దేశంలోని ఇతర ప్రముఖ పర్యాటక కేంద్రాలతో పోల్చి చూపించారు. "ఇది లక్షద్వీప్ కాదు వైజాగ్... సిక్కిం కాదు కైలాసగిరి... సుందర్ బన్స్ కాదు కోరింగ... తమిళనాడు కాదు సింహాచలం... గోవాలోని బాగా బీచ్ కాదు రుషికొండ బీచ్... ఇది కేరళ కాదు కోనసీమ... ఇది ఆంధ్రప్రదేశ్" అంటూ సాగే ఈ వీడియో రాష్ట్రంలోని ప్రకృతి రమణీయతను కళ్లకు కడుతోంది. ఈ వీడియోతో పాటు లోకేశ్ ఒక సందేశాన్ని కూడా పోస్ట్ చేశారు. "పవిత్ర ఆలయాల్లోని మంత్రోచ్చారణల నుంచి అంతులేని సముద్ర తీరం వరకు, కాలుష్యానికి దూరంగా ఉన్న కొండల అందాల వరకు ఆంధ్రప్రదేశ్ ఆత్మకు ఓ గొప్ప ప్రయాణం లాంటిది. ఇక్కడ ప్రకృతి, ఆధ్యాత్మికత, అవకాశాలు అన్నీ ఒకేచోట సంగమిస్తాయి. రండి, ఆంధ్రప్రదేశ్ మ్యాజిక్‌ను అనుభూతి చెందండి" అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు.




Printed,Published and owned by Chitta Vasavidevi Printed at Rama Offset Printers, 7th ward, Ponnuru, Guntur District-522 124 Andhra Pradesh and Published at 7th ward, Ayyappa Nagar, Ponnuru-522 124, Guntur District. Andhra Pradesh. Editor : Chitta Vasavidevi. RNI No.APTEL/2016/69464, Phone No.9346935672, kalamcounter@gmail.com